క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం



వెంకన్నను దర్శించుకుంటున్న గొలగాని హరివెంకటకుమారి దంపతులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు భరత్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భరత్‌నగర్, టీఐసీ పాయింట్, డ్రైవర్స్ కాలనీ, శ్రీహరినగర్ తదితర కాలనీల నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ దంపతులు వెంకన్నను దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హరివెంకటకుమారికి సత్కారం



మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిని సత్కరిస్తున్న ఎఫ్‌ఆర్‌యూ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి పుట్టిన రోజు సందర్భంగా గురువారం పలువురు రాజకీయ నాయకులు పెదగదిలిలో నివాసంలో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఆరిలోవ జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఎఫ్ఆర్‌యూ) సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం, బహుమతి ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్‌లకు వారంతా శాలువా కప్పి సత్కరించారు

విలువలతో కూడిన విద్యను బోధించాలి



హెచ్‌ఎం కృష్ణవేణిని అభినందిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

బీచ్‌రోడ్డు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని 20వ వార్డు కార్పొరేటర్ ముమ్మల లక్ష్మి సురేష్ సూచించారు. నౌకానగర్ ప్రాథమిక పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణిని గురువారం ఆమె కలిసి అభినందించారు. విద్యార్థులకు చక్కని విద్యాబుద్ధులు నేర్పించి పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని కార్పొరేటర్ కోరారు. తమ నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

పేదలందరికీ పథకాలు వర్తింపజేయాలి

మద్దిలపాలెం: కొన్ని వర్గాల పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా ఉన్నాయని బీజేపీ నేత మూలా వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల కారణంగా కొంతమంది పేదలకు పథకాలు అందడం లేదని, దీనిపై సీఎం, డిప్యూటీ సీఎంలు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీ పథకాలకు కొన్ని వర్గాల పేదలు అర్హులు కాకుండా పోయారన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రూ.25 వేల కంటే తక్కువ ఆదాయం వచ్చే అన్ని కుటుంబాలను పథకాలకు అర్హులను చేయాలని, ఈ మేరకు నిబంధనలు సడలించాలని సూచించారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన

ఏయూక్యాంపస్: శారీరక వ్యాయామం చేసే వారికి ప్రోటీన్ ఎంతో అవసరమని ఆయుర్వేద నిపుణురాలు మధుమిత కృష్ణన్ అన్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో గురువారం నిర్వహించిన ఆరోగ్య పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో ప్రజలకు విస్తృత అవగాహన పెరిగిందన్నారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించడానికి యోగా సమగ్రంగా దోహదపడుతుందన్నారు. ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాల సమాహారంగా నిలిచే బాదం శరీరానికి అవసరమన్నారు. నిత్యం తీసుకునే ఆహారంలో దీనిని చేర్చుకోవాలని సూచించారు.

వసూళ్లే.. వసూళ్లు!

- జోన్–3లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- కనీస చర్యలు తీసుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- తెరవెనుక మంతనాలు, వసూళ్లకే అధిక ప్రాధాన్యం
- జీవీఎంసీ ఆదాయానికి భారీగా గండి



సెక్టార్-10లో అనధికారికంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ జోన్–3 కార్యాలయం పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వలు వార్డుల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా.. ఆ విభాగం కనీస చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. దీంతో జీవీఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. జోన్–3 ఏసీపీ నుంచి వార్డ్ ప్లానింగ్ కార్యదర్శుల వరకు వారి వారి పరిధిలోని అక్రమ నిర్మాణాల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. స్థానిక సచివాలయ ప్లానింగ్ కార్యదర్శుల ద్వారా ఉన్నతాధికారులు బిల్డర్లతో మంతనాలు జరిపించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ కారణంగానే వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నా.. చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆయా అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్నా.. నోటీసులిచ్చాం, చర్యలు తీసుకుంటామంటూ కార్యదర్శులు చేతులు దులిపేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.



సెక్టార్-6 బుద్ధవనం ఎదుట నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన 3 భవనాలు

అనధికార కట్టడాలపై చర్యలు శూన్యం

జోన్–3 పరిధిలో ఈ ఏడాది కాలంగా వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరిగాయి. ఎంవీపీ కాలనీ, లాసన్స్ బే కాలనీ, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, పెదవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీల్లో ఇలాంటి భవనాలు పెద్ద సంఖ్యలో ఉండగా నాలుగు, ఐదు అంతస్తులకు అనుమతులు లేకుండానే నిర్మాణాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి.

◆ ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని బుద్ధవనం దరి ఓ బిల్డర్ నిబంధనలకు విరుద్ధంగా ఇరుకు రోడ్డులో నాలుగంతస్తుల భవనం నిర్మిస్తుండటంపై పలు ఫిర్యాదు వెళ్లాయి. టౌన్ ప్లానింగ్ కార్యదర్శి ఆ బిల్డర్‌కు నోటీసులు జారీ చేసి మామ అనిపించారు.

◆ ఇదే ప్రాంతంలో ఓ మహిళ బిల్డర్ టౌన్ ప్లానింగ్ అధికారులకు భారీగా ముడుపులు చెల్లించి నిబంధనలకు విరుద్ధంగా 3 ఐదంతస్తుల భవనాలను వరుసగా నిర్మించింది. ఒక్క భవనంపై కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పెద్ద చర్చనీయాంశమైంది.

◆ ఎంవీపీ కాలనీ సెక్టార్–1లో మెయిన్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ అవసరాలకు ఐదు అంతస్తుల భవన నిర్మాణం యథేచ్ఛగా జరుగుతున్నా.. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

◆ ఎంవీపీ కాలనీ సెక్టార్–10 ఏఎస్ రాజా సర్కిల్ దరి ఓ ఐదంతస్తుల భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నా.. కనీస చర్యలు చేపట్టలేదు.



ఎంవీపీ సెక్టార్-5లో ఓసీ లేకుండా ప్రారంభమైన ఓ బహుళ అంతస్తుల భవనం

బినామీలతో తెరవెనుక ఒప్పందాలు

ఏడాది కాలంగా జోన్–3 టౌన్ ప్లానింగ్ అధికారులు చాలా వార్డుల్లో ఏ అక్రమ నిర్మాణంపైనా చర్యలు తీసుకోకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ ఏసీపీ నుంచి కార్యదర్శుల వరకు అంతా ఆయా అక్రమ నిర్మాణదారుల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. చాలా వార్డుల్లో కూటమి ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు సైతం బిల్డర్ల నుంచి వసూళ్లకు పాల్పడటంలో భాగస్వాములుగా నిలుస్తున్నారు. దాన్ని అదునుగా తీసుకొని టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు చెలరేగిపోతున్నారు. ఫిర్యాదులను తుంగలోకి తొక్కి రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–5లో అక్రమంగా ఓ భవన నిర్మాణం జరిగి నెలలు గడిచినా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు ఉదాహరణగా పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుత ఏసీపీ మధుసూదన్‌రావు నేరుగా కొందరు బినామీలను ఏర్పాటు చేసుకుని బిల్డర్లతో లంచాల కోసం మంతనాలు జరిపిస్తున్నట్లు జోన్–3 పరిధిలో ఆరోపణలు చక్కర్లు కొడుతున్నాయి. వీరంతా అదనపు అంతస్తులతోపాటు అక్రమం నిర్మాణం జరిగితే చాలు అక్కడ వాలిపోతున్నారు. ఏసీపీ పేరు చెప్పి బిల్డర్‌తో మంతనాలు జరిపి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏసీపీతోపాటు ఇతర అధికారులు మీ నిర్మాణంపై ఎలాంటి చర్యలు ఉండకూడదంటే రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలు చెల్లించాలంటూ బేరాలు చేస్తున్నారు. అనంతరం బిల్డర్ల నుంచి ఆ సొమ్ము వసూలు చేసి టౌన్ ప్లానింగ్ ఏసీపీ, ఇతర అధికారులకు వీరే పంచుతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. జోన్–3 పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల కంటే వారు నియమించుకున్న బినామీల పట్లే ప్రస్తుతం బిల్డర్లు ఎక్కువ ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. జీవీఎంసీ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



సెక్టార్-1 మెయిన్ రోడ్డులో నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్న భవనం



ఎంవీపీ సెక్టార్-6లోని ఇరుకు రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

యోగాంధ్ర ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండకూడదు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్

ఏయూక్యాంపస్: విశాఖ బీచ్ రోడ్డు వేదికగా జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ అధికారులను రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులతో కలిసి ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం వద్దనున్న యోగా ప్రధాన వేదిక, పార్క్ హోటల్ కూడలి, తెన్నేటి పార్క్, సీతకొండ, ఏ వన్ గ్రాండ్, తిమ్మాపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను, తాగునీరు, పబ్లిక్ టాయిలెట్లు, పారిశుద్ధ్య పనులు, లైటింగ్ నిర్వహణను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ జరపాలని సూచించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న మరుగుదొడ్ల వద్ద తగినంత నీటిని ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలంతా రాత్రి వస్తున్నందున లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు, కె.వి.ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర జయప్రదానికి పిలుపు

ఆరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న నగరంలో జరగనున్న యోగాంధ్రను తూర్పు నియోజకవర్గ ప్రజలు జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు. 13వ వార్డు దుర్గాబజార్ వద్ద గురువారం స్థానిక కూటమి నాయకులు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యేతోపాటు కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఉగ్ర నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడుతూ అంతా కలిసి యోగాంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యోగాసనాల కోసం జనాన్ని తరలించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్పొరేటర్లు కెల్ల సునీత, మద్దిల రామలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు



పాత డెయిరీఫారం వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం వాహనాల రద్దీ

ఆరిలోవ: యోగాంధ్ర సందర్భంగా నగరంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రెండు రోజులుగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. హైవేపై ఎండాడ నుంచి నగరం వైపు వెళ్తున్న వాహనాలు బారులు తీరుతున్నాయి. కూడళ్లలో ఎర్ర బల్బు వెలిగిందంటే వందల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. జాతీయ రహదారిపై గురువారం డెయిరీ ఫారం కూడలి నుంచి హనుమంతవాక, వెంకోజీపాలెం వరకు ఉదయం నుంచి ట్రాఫిక్ నిలిచిపోయింది. బీచ్ రోడ్డులోకి వాహనాలు వెళ్లకుండా ఆపేశారు. దీంతో బీచ్ రోడ్డుపై వెళ్లాల్సిన వాహనాలు సైతం హైవేపైకి మళ్లుతున్నాయి. ఎండాడ, జూ పార్కు, డెయిరీ ఫారం, హనుమంతవాక, వెంకోజీపాలెం వరకు ట్రాఫిక్ రద్దీ పెరిగింది. బుధవారం కూడా హనుమంతవాక నుంచి అటు డెయిరీ ఫారం, ఇటు వెంకోజీపాలెం వరకు వాహనాలతో రోడ్డు కప్పేసింది. సుమారు కిలోమీటర్ దూరం ప్రయాణానికి అరగంటకు పైగా సమయం పడుతోంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనచోదకులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఆఫీసులకు వెళ్లడానికి, తిరిగి సాయంత్రం ఇంటికి చేరడానికి కష్టమవుతోందని వాపోతున్నారు.

బీచ్ రోడ్డులో జోరుగా ఏర్పాట్లు



తెన్నేటి పార్క్ వద్ద గ్రీన్‌మ్యాట్‌పై ప్రయాణిస్తున్న కారు



బీచ్ రోడ్డుపై గుంతలు పూడ్చి ఏర్పాటు చేసిన రెయిలింగ్

ఏయూక్యాంపస్: శివారు ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే బారికేడ్ల నిర్మాణం పూర్తయ్యింది. కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసే పనులు చేపడుతున్నారు. వాటిలో అందరూ వీక్షించే విధంగా భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు. కైలాసగిరి రోప్ వే నుంచి జోడుగుళ్లపాలెం మీదుగా సాగర్‌నగర్ వరకు బీచ్ రోడ్డుకు ఒకవైపు గ్రీన్ మ్యాట్ వేసే పనులు జరుగుతున్నాయి. పక్కనే ఉన్న కొండల నుంచి రాళ్లు జారి పడకుండా ముందు జాగ్రత్తగా అవసరమైన ప్రాంతాల్లో ఇనుప పోల్స్‌తో బారికేడ్లు వంటి నిర్మాణాలు సైతం చేపట్టారు. గురువారం ఉదయం తెన్నేటి పార్క్ వద్ద ఉన్న మార్గంలో కొంత మంది వాహనాలను గ్రీన్‌మాట్‌పై నడపడం కనిపించింది. ఒక కారుకు గ్రీన్ మ్యాట్‌పై ఉండే ప్లాస్టిక్ కవర్ చుట్టుకుని ఆగిపోయింది. దీనితో అక్కడే పని చేస్తున్న కార్మికులు వచ్చి ఆ ప్లాస్టిక్ కవర్ తొలగించి, కారును పక్కనున్న మార్గంలో వెళ్లాలని సూచించారు. కొంత మంది వాహనాలపై పక్కనే ఖాళీగా ఉన్న రహదారిపై వెళ్లకుండా గ్రీన్ మ్యాట్ వేసి ఉన్న మార్గంలో వెళ్లారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో బీచ్ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చే పనులు పూర్తిచేశారు. రోడ్డు పక్కన, మధ్యలో గతంలో ఏర్పడిన గుంతను పూడ్చారు. కొత్తగా తారు వేసి రోలర్‌తో సరిచేశారు. బీచ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో రహదారులపై చేసిన ప్యాచ్ వర్క్‌లు కనిపిస్తున్నాయి.

పోలీసుల వలయంలో ప్రధాన కూడళ్లు

బీచ్‌రోడ్డు: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు విశాఖకు ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న నేపథ్యంలో నగరంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులను భారీ ఎత్తున మోహరించారు. ముఖ్యంగా ఆర్.కె.బీచ్‌కు వెళ్లే ఆర్టీసీ కాంప్లెక్స్, సిరిపురం, రామ్‌నగర్, మద్దిలపాలెం కూడళ్లలో పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు.



సిరిపురం కూడలిలో మోహరించిన పోలీసులు

సాగర తీరంలో శునకాల బెడద



సాగర తీరంలో శునకాల బెడద తప్పడం లేదు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అధికారులకు శునకాల సంచారం తలనొప్పిగా మారింది. గురువారం విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన యోగా సాధన కార్యక్రమం మధ్యలో పలు శునకాలు యథేచ్ఛగా సంచరించాయి. దీంతో మహిళలు భయపడిపోయారు. ప్రశాంతంగా యోగా సాధన చేసే సమయంలో వీటి సంచారం కొంత ఇబ్బందిగా మారుతోంది. జీవీఎంసీ సిబ్బంది కుక్కలను కట్టడి చేయడానికి ఎంత ప్రయత్నిస్తున్నా.. అవి మళ్లీ దర్శనమిస్తున్నాయి. ప్రధాని పాల్గొనే సమయంలో ఇటువంటి శునకాలు సంచరిస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది.



ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అలంకారప్రాయమే..!

- హడావుడిగా బీచ్ రోడ్డు సుందరీకరణ
- నీరు లేక ఎండిపోతున్న మొక్కలు



ఆక్వా స్పోర్ట్స్ వద్ద వాడిపోతున్న మొక్కలు



డివైడర్ మధ్యలో ఉంచుతున్న మొక్కలు



డివైడర్ మధ్యలో ఎండిపోతున్న మొక్కలు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా బీచ్ రోడ్డును అలంకరిస్తున్నారు. అయితే రహదారి పొడవునా చేపడుతున్న సుందరీకరణ పనులు కేవలం అలంకరణకు మాత్రమే అన్న చందంగా ఉన్నాయి. ప్రస్తుతం డివైడర్ల మధ్యలో రెండు రకాల మొక్కలను ఉంచుతున్నారు. వీటిని డివైడర్ మధ్యలో ఉన్న ప్రాంతంలో నాటకుండా కుండీలు, కవర్లలో యథాతథంగా పెడుతున్నారు. యోగా డే కార్యక్రమం అయిపోయిన తరువాత వీటిని మళ్లీ తీసుకెళ్లేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మొక్కలను కొనుగోలు చేశారా.. లేక అద్దెకు తీసుకొచ్చారా..? అనేది తెలియడం లేదు. మరోవైపు రోడ్డు మధ్యలో ఉంచిన మొక్కల్లో కొన్ని ఎండిపోతున్నాయి. వీటిని తరలించే సమయంలో తగినంత నీరు అందించకపోవడం, ఇక్కడికి తెచ్చిన తరువాత నీరు అందించేవారు లేకపోవడంతో ప్రస్తుతం మొక్కలు వాడిపోతున్నాయి. జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ సెంటర్ ఎదురుగా నాటిన మొక్కలు సైతం నీరు లేక జీవం కోల్పోతున్నాయి. ఈ మొక్కలకు కొద్దిపాటి నీరు అందించే దిశగా నీటి సరఫరా విభాగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



సీ హారియర్ వద్ద నాటిన మొక్కలు

విద్యార్థుల యోగా సాధన



యోగా సాధనలో సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–8లోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు గురువారం యోగాసనాలు సాధన చేశారు. ఈ నెల 21న విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు స్కూల్ నిర్వాహకులు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో తమ స్కూల్‌కు చెందిన 800 మంది విద్యార్థులు భాగస్వాములు అవుతున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా పాఠశాల యోగా గురువులు విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి, ఆసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ వరలక్ష్మి, సంస్థ ప్రతినిధి చలం తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్లు సరిపోయేనా..?



టాయిలెట్లలోకి నీరు నింపుతున్న జీవీఎంసీ సిబ్బంది



కంపార్ట్‌మెంట్‌ల పక్కన ఏర్పాటు చేసిన టాయిలెట్

ఏయూక్యాంపస్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా సాధన చేయడానికి బీచ్ రోడ్డులో సిద్ధం చేస్తున్న కంపార్ట్‌మెంట్లకు చేరువలో సంచార టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటికి అవసరమైన నీటిని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ప్రారంభించింది. టాయిలెట్ పైభాగంలో ఉండే చిన్న ట్యాంకులో నీటిని నింపుతున్నారు. దీనిలో కేవలం 200 లీటర్ల నీరు మాత్రమే నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ఎక్కువ మంది హాజరవుతున్న తరుణంలో ఈ నీరు సరిపోతుందా అనే సందేహం వ్యక్తమవుతోంది. డమ్ములతో నీటిని సైతం పక్కనే ఉంచితే కొంత ఉపయుక్తంగా నిలుస్తుందని పలువురు సూచిస్తున్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్ ఔషధంపై పేటెంట్



పరిశోధనా బృంద సభ్యులను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బి.కిషోర్‌బాబు, పరిశోధనా బృందం అప్పారావు, స్వర్ణలత, వీర్రాజు, గోపి, ఫణి ఒక గొప్ప విజయం సాధించారు. బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్సకు అభివృద్ధి చేసిన నూతన నాప్తాలిమైడ్ డెరివేటివ్ సమ్మేళనానికి భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం 20 ఏళ్ల కాలానికి పేటెంట్ మంజూరు చేసింది. ఈ సమ్మేళనం నిర్దిష్టమైన బ్రెస్ట్ క్యాన్సర్ కణాలపై మెరుగైన ప్రభావాన్ని చూపడం, తక్కువ దుష్ప్రభావాలు కలిగి ఉండటంతోపాటు డ్రగ్–రెసిస్టెంట్ కణాలను లక్ష్యంగా చేసుకునే ప్రత్యేకమైన పని విధానాన్ని కలిగి ఉండటం వంటి అనేక ప్రయోజనాలను కలిగి ఉందని పరిశోధనా బృంద సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఈ బృందాన్ని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ కిషోర్‌బాబు అభినందించారు. ఈ ప్రయోగాత్మక విజయం యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకురానుందని వారు పేర్కొన్నారు.

సాంబశివరావుకు ఐసీఎస్ఎస్ఆర్ సీనియర్ ఫెలోషిప్



ఆచార్య సాంబశివరావును సత్కరిస్తున్న చైర్మన్ సుదర్శనరావు తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఆచార్యులు ఎస్.సాంబశివరావు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్)లో సీనియర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్(ఐఐపీఏ) విశాఖ ప్రాంతీయ కేంద్రం సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. ఐఐపీఏ విశాఖ కేంద్రం చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు మాట్లాడుతూ విశాఖలో ఉద్యోగుల జీవన నాణ్యతపై ఉద్యోగుల సంక్షేమ పద్ధతుల ప్రభావం అనే అంశంలో పరిశోధనకు సాంబశివరావు ఎంపికయ్యారని తెలిపారు. కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం నుంచి 2024–26 సంవత్సరానికి ఈయన ఒక్కరే ఎంపికవడం విశేషమన్నారు. ఐఐపీఏ కార్యదర్శి ఆచార్య పీటీటి ప్రేమానందం మాట్లాడుతూ ఇలాంటి ఫెలోషిప్‌లకు ఏయూ ఆచార్యులు ఎంపికవడం వర్సిటీకి జాతీయస్థాయిలో మంచి గుర్తింపును తెస్తుందన్నారు. ఐఐపీఏ సభ్యులు ఆచార్య షమీం, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.